# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : మంఖాల దాసు

తెలంగాణ మంగళవారం, 15 - జూలై - 2025 సంపుటి : 16 సంచిక : 352 పేజీలు 08 వెల : 6/-


# ప్రతి పేదవాడికి రేషన్ కార్డు..

## తుంగతుర్తికి గోదావరి జలాలు తీసుకొస్తా

- తిరుమలగిరిలో నూతన కార్డుల పంపిణీ ప్రారంభం
- కాళేశ్వరం కూలేశ్వరం అయింది
- తులసీవనంలో గంజాయి మొక్కలను పీకేయండి
- 2034 వరకు కాంగ్రెస్‌దే అధికారం
- నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదు
- మూడు అడుగులున్న స్థానిక నేత ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా
- బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవలేదని.. బెల్ట్ షాపులు తెరిచారు
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి






టైమ్స్ ఆఫ్ వార్త - సూర్యాపేట జిల్లా ప్రతినిధి(పోతరాజు వెంకన్న)

ఇరవై ఎనిమిది వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం కూలేశ్వరం అయింది.. ప్రజాధనాన్ని వృథా చేసిన వారిని కాళేశ్వరంలో ఉరి తీయాలి.. తులసీవనంలో గంజాయి మొక్కలను పీకేయాలి.. తుంగతుర్తికి మేము గోదావరి జలాలు తీసుకొస్తాం.. రేషన్‌కార్డు పేదల ఆత్మగౌరవానికి సూచిక..” అని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి మండల కేంద్రంలో సోమవారం నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలు తీసుకురాని ముఖ్యమంత్రిని అడ్డుకుంటామని సూర్యాపేట ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ.. మూడ్రోజులు సమయం ఇస్తే గోదావరి జలాలు తెస్తానని గొప్పలు పలికిన ఆయన పదేండ్లు అధికారంలో ఉండి గడ్డి పీకారా? అని ప్రశ్నించారు. వాళ్లు దేవాదుల నుంచి కూడా నీళ్లు తేలేదన్నారు. ‘మూడు అడుగుల జగదీశ్‌రెడ్డి.. గోదావరి జలాలు తేవడం అంటే గ్లాస్‌లో సోడా కలపడమా.. నా కార్యక్రమాన్ని అడ్డుకుంటామని ప్రగల్భాలు పలుకుతున్నావు.. తుంగతుర్తి గడ్డ మీద సవాల్ విసురుతున్న.. మా దామన్న ఒక్కడు చాలు నీ కథ ఏందో చూడటానికి’ అని అన్నారు. తులసీవనంలో గంజాయి మొక్కలా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 నియోజకవర్గాలకుగాను ఇక్కడ ఒక్క చోట గెలిచావు.. వచ్చే ఎన్నికల్లో గంజాయి మొక్కను పీకే బాధ్యత మా అక్కలదే అని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల, గ్రామస్థాయిలో అన్ని చోట్లా గెలిపించే బాధ్యత పార్టీదేనని, ఒక్క గంజాయి మొక్క కూడా గెలవడానికి వీల్లేదని ఆ బాధ్యత మీరే తీసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. రూ.50 వేలతో తుంగతుర్తికి వస్తే 60 వేల మెజార్టీతో సామెల్‌ను గెలిపించారని, ఏ ఎన్నికల్లో అయినా నేతలను గెలిపించే బాధ్యత పార్టీ తీసుకుంటుం దని చెప్పారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని అన్నారు. ”బీఆర్ఎస్ నేతలంతా కట్టకట్టుకుని రండి.. మీరంతా ఒకవైపు.. మా కాంగ్రెస్ కార్యకర్తలు ఒకవైపు” అని సవాల్ విసిరారు.

### త్వరలోనే గ్రామ పంచాయతీ ఎన్నికలు

త్వరలోనే గ్రామపంచాయతీ ఎన్నికలు రానున్నాయని, తమ ప్రభుత్వం దేశంలోనే ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఏకైక రాష్ట్రమని సీఎం చెప్పారు. రాష్ట్రంలో జనగణన, కులగణన చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5.6 లక్షల నూతన రేషన్ కార్డుల పంపిణీతో పాటు, 26 లక్షల మంది పేర్లను కార్డుల్లో చేర్చడం ద్వారా మొత్తం 3 కోట్లా 10 లక్షల మందికి సన్నబియ్యం అందించనున్నామని వివరించారు.

మిగతా 8లో..

## తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా అపరేష్ కుమార్ సింగ్

### తొమ్మిది రాష్ట్రాల్లో సీజేలకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి(సీజే)గా అపరేష్ కుమార్ సింగ్ నియమితు లయ్యారు. ప్రస్తుతం త్రిపుర హైకోర్టు సీజేగా సేవలందిస్తోన్న జస్టిస్ అపరేష్ కుమార్ బదిలీపై తెలంగాణకు హైకోర్టుకు రానున్నారు. ఈ మేరకు సోమవారం దేశంలోని ఐదు రాష్ట్రాలకు సీజేల నియామకం, నాలుగు రాష్ట్రాలకు సీజేల బదిలీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. తాజాగా మొత్తం 9 రాష్ట్రాలకు సీజేల నియామకం/ బదిలీలకు సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియ ం సిఫారసులను రాజ్యాంగం కల్పించిన అధికారాలతో రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్టు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘువాల్ ‘ఎక్స్’ వేదికగా వెల్లడించారు. సీజేల నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసినట్టు తెలిపారు. అందులో భాగంగా జస్టిస్ మణింద్ర మోహన్ శ్రీవాస్తవను రాజస్థాన్ నుంచి మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌ను త్రిపుర నుంచి

మిగతా 8లో..

## మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం
- గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు
- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఉద్వాసన





**న్యూఢిల్లీ :** మూడు రాష్ట్రాలకు గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోవా గవర్నర్‌గా టీడీపీ నేత ,మాజీమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు నియమితులయ్యారు. హర్యానా గవర్నర్‌గా ఆషింకుమార్ ఘోష్, లద్దాక్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవిందర్ గుప్తాలను రాష్ట్రపతి నియమించారు. విజయనగరానికి చెందిన అశోక్ గజపతి రాజు టీడీపీలో ఉన్నారు. గతంలో ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు. తాజాగా ఆయనను గోవా గవర్నర్‌గా నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక హర్యానా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయకు ఉద్వాసన పలికారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పని చేసిన ఆయనను తొలుత హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా నియమించారు. ఆ తరువాత హర్యానా గవర్నర్‌గా నియమించారు. తాజాగా ఆయన స్థానంలో కొత్త గవర్నర్‌గా ఆషింకుమార్ ఘోష్‌ను నియమించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఈయన ప్రొఫెసర్‌గా ఉన్నారు. అదే విధంగా లద్దాక్ లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి బిడి మిశ్రా (రిటైర్డ్) చేసిన రాజీనామాను రాష్ట్రపతి ముర్ము ఆమోదించారనీ, ఆయన స్థానంలో కవిందర్ గుప్తాను నియమించారని రాష్ట్రపతి భవన్ విడుదల చేసిన ప్రకటన తెలిపింది.

## ఇందిరమ్మ రాజ్యంలో.. బిందె సేద్యం

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్


టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :



మంచినీళ్ల కోసం ఆడబిడ్డలు బిందెలు పట్టుకుని అడుగు బయట పెట్టొద్దని కెసిఆర్ సంకల్పిస్తే.. చివరికి మహిళలు బిందెలతో నీరు తెచ్చుకుని.. వరి నారు కాపాడుకునే పరిస్థితి కల్పిస్తావా..? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో బిందె సేద్యమా ఎంతటి దుస్థితి తీసుకొచ్చావని సిఎంను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. ఇప్పటికే తాగునీటి కోసం తండ్లాడుతున్న అక్కాచెల్లెళ్లకు ఈ కొత్త కష్టాలేంటి..? అని అడిగారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లిలోని రంగధాముని పల్లిలో ట్రాన్స్ ఫార్మర్ చెడిపోయి 15 రోజులైనా మరమ్మత్తు చేయించే తీరిక లేదా..? అని నిలదీశారు. ఏడాదిన్నరగా మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు మరమ్మత్తు చేయడం చేతకావడం లేదు అని, చివరికి ట్రాన్స్ ఫార్మర్లు కూడా రిపేర్ చేయించే సత్తా లేదా..? అని ప్రశ్నించారు. సాగునీటి వసతి కల్పించకుండా ఇప్పటికే చేతులెత్తేశారని, కనీసం కరెంట్ మోటర్లతో పంట కాపాడుకుందామంటే కూడా ఇన్ని కష్టాలా..? అని అడిగారు. బిఆర్ఎస్ హయాంలో పెరిగిన భూగర్భజలాలను వాడుకునే అవకాశం లేకుండా చేయడం దుర్మార్గం కాక మరేంటి..కళ్లముందే వరినారు ఎండిపోతుంటే తట్టుకోలేక.. బిందెలతో ఆడబిడ్డలు పడుతున్న అగచాట్లు ఈ ముఖ్యమంత్రికి కనిపించడం లేదా..? అని నిలదీశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం దేవుడెరుగు.. తాగు నీటితోపాటు సాగునీటికి కూడా బిందెలు మోస్తున్న ఈ ఆడబిడ్డల బాధలు తీర్చే సోయి ఈ సిఎంకు ఎప్పుడొస్తుందో అంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు.

## రేపు తెలుగు రాష్ట్రాల సిఎంల భేటీ

### జలవివాదాల పరిష్కారానికి కేంద్రం చొరవ
### కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ నేతృత్వంలో సమావేశం
### ఇరు రాష్ట్రాల సిఎంలకు సమాచారం
### రేపు ఢిల్లీకి బయలుదేరనున్న సిఎం రేవంత్‌రెడ్డి
### ముఖ్యమంత్రి సిఎం ఆదేశాలతో కేంద్ర జలవనరుల మంత్రికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

తెలుగు రాష్ట్రాల జల వివాదాలపై కేంద్ర ప్రభుత్వం ఈనెల 16వ తేదీన ఇరు రాష్ట్రాల సిఎంలతో సమావేశాన్ని ఏర్పాటుచేసింది. కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగే ఈ సమావేశానికి తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, ఎపి సిఎం చంద్రబాబునాయుడులను ఆహ్వానిస్తూ సోమవారం జలశక్తి శాఖ సర్క్యులర్ జారీచేసింది. తెలు గు రాష్ట్రాల ముఖ్యమంత్రుల స మావేశం న్యూ ఢిల్లీ లో 16వ తేదీన మధ్యాహ్నం 2:30 గంటలకు జరుగనున్నది. ఇదిలా ఉండగా, కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ వాటాలను సాధించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సి ఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ కు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని, న్యా యపరంగా రావాల్సిన నీటి వా టాల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు.

### రేపు ఢిల్లీకి సిఎం రేవంత్ రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. మధ్యాహ్నం ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లి బుధ, గురురవారాలు(జులై 16, 17 తేదీలు) అక్కడే ఉంటారని సమాచారం.

మిగతా 8లో..

## తమ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి కబ్జాకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి



### బాధితుడు మహిపాల్ రెడ్డి ఆవేదన

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

తమ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి కబ్జాకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు మహిపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డొంకేశ్వర్ మండలం గాదే పల్లి గ్రామానికి చెందిన తన పంట భూమి జి.జి నడుకుడ గ్రామ శివారులోని తమ సాగు భూమి 1129 సర్వేనెంబర్ లో 5 ఎకరాల ఏడు గుంటల భూమి తన పేరుపై ఉందని, తమ భూమి ఇరు ప్రక్కన ఉన్న 1128,1130 సర్వే నెంబర్లలో ఉన్న మోతే రమణ, మోతే గంగారెడ్డి లకు సంబంధించిన కుటుంబ సభ్యులతో పాటు మరో సర్వే నంబర్ కు చెందిన బద్దం మల్లారెడ్డి, గంపల కళ్యాణ్ కుటుంబ సభ్యులు తన పంట భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే గతంలో డొంకేశ్వర్ మండలం సర్వే యర్ అందరికీ మూడుసార్లు నోటీసులు ఇచ్చి సర్వేనెంబర్ 1128, 1129, 1130 సర్వే భూముల్లో హద్దులు పాటించి పంచనామ చేశారని తెలిపారు. గతంలో ఆర్మూర్ ఆర్డీవో సర్వే నెంబర్ 1129కి రక్షణ కల్పించాలని నందిపేట్ ఎస్ హెచ్ ఓ కి, డొంకేశ్వర్ ఎమ్మార్వోకు ఆదేశాలు సైతం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఆర్డీవో ఆదేశాలు, స్థానిక ఎమ్మార్వో ఆదేశాలు పోలీసులను సైతం లెక్క చేయకుండా వారు తమపై అక్రమ కేసులు బనాయిస్తూ తమ కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇప్పటికీ కూడా అధికారుల ఆదేశాలు పట్టించుకోకుండా తమ పక్కనున్న సర్వే నెంబర్ 1128, 1130 కి చెందిన వారు ట్రాక్టర్లతో తమ పంట పొలంలో దున్నుతూ తమను సాగు చేయకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధి కారులు తమకు న్యాయం చేయాలని బాధితులు మైపాల్ రెడ్డి వేడుకున్నారు.

# మహిళా సాధికారత సాధనే ప్రభుత్వ లక్ష్యం

### నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి
### రూరల్ సెగ్మెంట్ లో ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబురాలు
### కలెక్టర్ తో కలిసి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

మహిళా సాధికారత సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తోందని గుర్తు చేశారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలో ఇందిరా మహిళా శక్తి సంబురాలను సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. బోర్గం (పి) శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డితో కలిసి మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, లోన్ బీమా, బాధిత కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటుతో వ్యాపార లావాదేవీల నిర్వహణ ద్వారా సాధించిన ఆర్థిక ప్రగతి గురించి ఆయా సంఘాల మహిళా సభ్యులు వివరిస్తూ, తోటి సభ్యులలో స్ఫూర్తిని పెంపొందించారు. మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ ఉచిత ప్రయాణ సౌకర్యం ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ., మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ చేపట్టిన వెనువెంటనే ఉచిత ప్రయాణాన్ని అమలులోకి తెచ్చిందని గుర్తు చేశారు. మహిళల ఉచిత ప్రయాణ చార్జీలను ప్రభుత్వమే భరిస్తోందని, 18 నెలల కాలంలోనే ఆర్టీసీకి రూ. 6500 కోట్లు చెల్లించిందని అన్నారు. మహిళా సాధికారతను కేవలం నినాదానికే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేసి చూపుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే మహిళలను లబ్దిదారులుగా ఎంపిక చేస్తూ ఇందిరమ్మ ఇళ్ళను వారి పేరిట మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు. ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా లబ్దిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. స్వశక్తితో మహిళలు సాధికారత దిశగా పయనించేలా సోలార్ పవర్ ప్లాంట్ లు, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బంక్ లు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లు, మహిళా శక్తి బజార్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో బడులలో మౌలిక సదుపాయాల కల్పన పనులు, స్కూల్ యూనిఫామ్ ల స్టిచింగ్, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి అనేక అంశాలలో మహిళా సంఘాలకు అవకాశం కల్పిస్తూ వారి ఆర్థిక పురోగతికి బాటలు వేస్తోందని అన్నారు. ఏటా రూ. 25 వేల కోట్ల చొప్పున నాలుగేళ్లలో మహిళల సంక్షేమ, అభివృద్ధికి ప్రభుత్వం రూ. లక్ష కోట్లు ఖర్చు చేస్తుందని అన్నారు. కేవలం ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా రాజకీయ రంగంలో కూడా సరైన ప్రాతినిధ్యం కల్పించేలా చట్టసభలలో 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మహిళా సంఘాలకు సూచించారు.

మహిళా సంఘాల అభ్యున్నతికి బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణాలు.. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ., మహిళా సంఘాల ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణాలను పెద్ద మొత్తంలో పంపిణీ చేస్తోందని అన్నారు. జిల్లాలోని 20,547 మహిళా సంఘాలకు రూ. 21.69 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం లోని 5781 మహిళా సంఘాలకు రూ. 5.91 కోట్ల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రమాద బీమా, బీమా లోన్, బ్యాంకు లింకేజీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని కలెక్టర్ వివరించారు. ప్రమాద బీమా అమలు వల్ల బాధిత కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం వర్తించడంతో పాటు మహిళా సంఘం కొనసాగేందుకు బీమా దోహద పడుతుందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో మహిళల అభ్యున్నతి కోసం విస్తృత స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ వేడుకలలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, డీఆర్డీఓ సాయాగౌడ్, సొసైటీల చైర్మన్లు, జిల్లా, మండల మహిళా సమాఖ్యల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 94 ఫిర్యాదులు



టైమ్స్ ఆఫ్ వార్త -నిజామాబాద్ కలెక్టరేట్

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 94 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లతో పాటు మెప్మా పీ.డీ రాజేందర్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం..

### అధ్యక్ష కార్యదర్శులుగా పాకాల నరసింహారావు, గంజి రమేష్

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



2025 - 26 సంవత్సరానికి గాను రోటరీ క్లబ్ జెమ్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఏడాది కాలం పదవి కోసం రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ అధ్యక్షునిగా పాకాల నరసింహారావు, కార్యదర్శిగా గంజి రమేష్ ఎన్నికయ్యారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మాజీ డిజిపి రొటేరియన్ అనురాగ శర్మ పాల్గొని క్లబ్ నూతన అధ్యక్షుడిగా రొటేరియన్ పాకాల నరసింహారావుతో పాటు కార్యదర్శిగా రోటేరి యన్ గంజి రమేష్, కోశాధికారిగా రొటేరియన్ పాల్తి రజిత్ కుమార్, బోర్డు మెంబర్స్ తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షుడు పాకాల నరసింహా రావు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ లేక్ డిస్ట్రిక్ట్ మొహినాబాద్ వారి సహ కారంతో ఆ క్లబ్ ట్రస్ట్ అయిన తెలంగాణ మాజీ డిజిపి రొటేరియన్ అనురాగ్ శర్మ రోటరీ క్లబ్ జెమ్స్ వారితో కలిసి నిజామాబాద్ నగరంలో ప్రభుత్వ బాలికల పాఠశాలలో రూ.30 లక్షల విలువ చేసే 2 టాయిలెట్ బ్లాక్స్ నిర్మించి ఇస్తామని తెలియజేశారు. అదేవిధంగా రోటరీ క్లబ్ జెమ్స్ కాబోయే అధ్యక్షుడు రొటీరియన్ పడాల సత్తయ్య తెలియజేస్తూ అనురాగ శర్మ తెలంగాణ మొదటి డిజిపిగా బాధ్యతలు నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకొని రూ.51వేలు మన భారత సైన్యానికి విరాళం ప్రకటించారని తెలియజేశారు. ఇందులో భాగంగా పలువురు నూతన కార్యవర్గాన్ని శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా రోటరీ మాజీ గవర్నర్ రొటేరియన్ నల్ల వెంకట హనుమంత్ రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ రొటీరియన్ జైపాల్ రెడ్డి, రోటరీ క్లబ్ నిజామాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ రోటరీ క్లబ్ కామారెడ్డి సభ్యులు, తాజా మాజీ అధ్యక్ష కార్యదర్శులు పద్మ శ్రీనివాస్, రాచకొండ గౌరీ శంకర్, రంజిత్ సింగ్ ఠాకూర్, న్యాలం గిరీష్ కుమార్, తాటిపాముల సూర్య ప్రకాష్, డాక్టర్ కులకర్ణి, బంగారు వీరబ్రహ్మం, రాంప్రసాద్, పాల్గొన్నారు.

## తొలగించిన శానిటేషన్ వర్కర్ను విధుల్లోకి తీసుకోవాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

కలెక్టర్ కార్యాలయంలో తొలగించిన శానిటేషన్ వర్కర్ ను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న షానిటేజర్ వర్కర్ ను ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తొలగించడం సరైనది కాదని అన్నారు. ఇప్పటివరకు ఆమెపై ఎలాంటి అభియోగం లేదని, పనిచేస్తున్న కార్మికురాలని తొలగించడంలో మతలబు ఏమిటని, ఆమెపైనే కుటుంబం ఆధారపడి ఉన్నదని, ఆ కార్మికురాలి జీవన ఉపాధి పైన దెబ్బతీయడం అంటే కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డట్టే అన్నారు. కానీ నాలుగైదు రోజులు అవుతున్న ఎలాంటి స్పందన లేకపోవడం వల్ల ఈరోజు అదనపు కలెక్టర్ ను కలిసామన్నారు. అధికారులపై ఏజెన్సీ పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికురాలని విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, నారాయణ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మంత్రి బట్టి దిష్టిబొమ్మ దగ్ధం

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



భారతీయ జనతా పార్టీ ఎస్సి మోర్చా జిల్లా అధ్యక్షుడు బిఆర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక పులంగ్ చౌరస్తా వద్ద ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క దిష్టిబొమ్మను దహన చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ బట్టి విక్రమార్క గౌరవప్రదమైన పదవిలో ఉండి ప్రజలను తప్పు దోవ పట్టించే విధంగా భారతీయ జనతా పార్టీ మీద మాట్లాడటం చాలా సిగ్గుచేటన్నారు. ముఖ్యంగా రోహిత్ వేముల దళితుడు కాదని, తాను బీసీ వడ్డెర వర్గానికి సంబంధించిన వ్యక్తి అని సైబరాబాద్ పోలీసులు హైకోర్టు ఇచ్చిన నివేదికలో పేర్కొనడం జరిగిందన్నారు. అలాగే 2024 మే 4న సైబరాబాద్ పోలీసులు హైకోర్టు ఇచ్చిన నివేదిక ప్రకారం రోహిత్ వేముల ఆత్మహత్యకు కుల వివక్ష కారణం కాదని, అలాంటి ఆధారాలు ఏది కూడా దొరకలేదని వారు సమర్పించడం జరిగిందన్నారు. కోర్టు తీర్పును తక్కువ చేసి మాట్లాడుతున్న బట్టి విక్రమార్క ఇదేనా మీరు రాజ్యాంగానికి ఇచ్చే విలువ, గౌరవం అని ప్రశ్నించారు. కోర్టు తీర్పు అంగీకరించని నేతలు అధికారంలో ఉండడం చాలా ప్రమాదకరం అన్నారు. ముఖ్యంగా ఎఫ్ఐఆర్ లో లేని వారి పేర్లు వారు కారణమని చెప్పడం ఇంకా దుర్మార్గం అన్నారు. ఈ చర్యలను భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా తీవ్రంగా ఖండిస్తూ ఉందని, హైకోర్టులో ఈ కేసు విచారణ ముగిసినా ఇప్పుడు మళ్లీ ఈ కేస్ ని ప్రస్తావించడం కేవలం బురదజల్లే రాజకీయాలు చేయడం, లేనిపోని ఆరోపణలు చేసిన బట్టి విక్రమార్క వెంటనే క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందీప్, దాసారం కుమార్, దేవర్, సంజు, సాయి వర్ధన్, బాలకృష్ణ, ముత్యాలు పాల్గొన్నారు.

# సాక్షులను కోర్టులో హాజరు పరిచి నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేయాలి

### నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య
### కోర్ట్ డ్యూటీ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించిన పోలీసు కమిషనర్



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ క్రైమ్

సాక్షులను కోర్టులో హాజరు పరిచి నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్ లో కోర్ డ్యూటీ కానిస్టేబుల్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కోర్ట్ డ్యూటీలో ఉన్న పోలీస్ సిబ్బంది మీరంతా న్యాయవ్యవస్థలో అత్యంత కీలకమైన భాగంగా పనిచేస్తున్నారన్నారు. కోర్ట్ డ్యూటీ అనేది కేవలం ఒక విధిగా కాకుండా ప్రజలకు న్యాయం అందించడంలో మీ పాత్ర ఎంత ముఖ్యమైనదో గుర్తుంచుకోవాలన్నారు. మీరు నిర్వహించే ప్రతి చర్య కోర్ట్‌కు సమయానికి హాజరు కావడం, సాక్షులను సురక్షితంగా తీసుకురావడం, న్యాయ ప్రక్రియలు నిరవధికంగా సాగిపోవడంలో సహకరించడం, ఇవన్నీ ప్రజల్లో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. మీ పని తీరు, ప్రవర్తన, సమయపాలన, నైతిక



విలువలు ఇవన్నీ పోలీస్ విభాగం క్రమశిక్షణను ప్రతిబింబిస్తాయన్నారు. కాబట్టి మీ సేవలను నిజాయితీగా, నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. వీరు చేస్తున్న సేవలను అభినందిస్తూ భవిష్యత్తులో ఇంకా సమర్థంగా పనిచేయాలని, పోలీస్ శాఖ గౌరవాన్ని మరింతగా పెంచే విధంగా మీరు ముందుకు సాగాలి అని ఆకాంక్షి%శీ%చారు. ప్రతి కోర్టు సిబ్బంది ఒక కార్యచరణ ప్రకారంగా తమ కోర్ట్ డ్యూటీ విధులు నిర్వర్తించాలని, లాంగ్ పెండింగ్ కేసులు త్వరితగతన డిస్పోజల్ చేయాలని, సాక్షులను సరిగ్గా ప్రతి కేసు విషయంలో చక్కని బ్రీఫింగ్ చేయాలని లేదా ముఖ్యమైన కొన్ని కేసు లలో సంబంధిత ఎస్సై, సీఐ, ఏసీపీ లతో బ్రీఫింగ్ చేయించాలన్నారు. నేరస్థునికి శిక్ష పడే విధంగా కృషి చేయాలన్నారు. కోర్టులో సీసీ నెంబర్లు, సీఎఫ్ ఆర్ నంబర్లు త్వరిత గతిన తీసుకోవాలని, కేసులు ఎందుకు కోర్టులో కొట్టివేయ బడుతున్నాయో వాటికి గల ముఖ్యమైన కారణాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, సమన్స్, వారెంట్స్ ఎప్పటికప్పుడు ఇవ్వాలని, చార్జ్ షీట్ కోర్టులో వేసే ముందు అన్నీ జాగ్రత్తగా చూసుకో వాలన్నారు. సిబ్బంది ఎల్లపుడు కోర్టులో నీట్ టర్న్ అవుట్ తో వెళ్లాలని, కోర్టులో జరిగే ప్రతీ ప్రక్రియ సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ కు తెలుపలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వా రెడ్డి, సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ సతీష్, కోర్ట్ లైజన్ ఆఫీసర్ శ్యామ్ కుమార్, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌ల పంపిణీ



టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

బోధన్ మండలంలోని ఏ రాజ్ పల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో సోమ వారం లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ఆధ్వర్యంలో విద్యార్థులకు జామెంట్రీ బాక్స లను పంపిణీ చేశారు . ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కొని ఉన్నత శిఖరాలకు చేరాలని రీజి యన్ చైర్మన్ పావులూరు వెంకటేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ భవాని అధ్యక్షులు గణపురం అశోక్ , కాట్రగడ్డ భారతి, నల్వాల కృష్ణ,సభ్యులు పాల్గొన్నారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
మంగళవారం,
15-07-2025


# బాసర ఐటీ లో ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లతో బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం

**రిజర్వేషన్లపై పునరాలోచన చేయాలి**

**ఎస్సీ, ఎస్టీ, బీసీ సోదరులందరు ఏకమై**

**రిజర్వేషన్ల పై పోరాడాలి**

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు**

**నరాల సుధాకర్**



టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ సిటీ

బాసర ట్రిపుల్ ఐటీ సీట్ల కేటాయింపులో బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ ఆరోపించారు. ఈ సందర్భంగా కేర్ డిగ్రీ కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటగిరీల వారీగా ఐఐటీ బాసరలో ప్రకటించిన కటాఫ్ మార్కులను చూస్తే డబ్ల్యూఎస్ ఓసీ లకు కటాఫ్ మార్కులు కేవలం 564 కాగా, బీసీ (ఏ) విద్యార్థులకు కటాఫ్ 571, బీసీ (బీ) కటాఫ్ 578, బీసీ (సీ) కటాఫ్ 566, బీసీ (డీ) కటాఫ్ 579, ఎస్సీ విద్యార్థులకు కటాఫ్ 566, ఎస్టీ విద్యార్థులకు కటాఫ్ 569 మార్కులుగా ఉండి అగ్రవర్ణాల విద్యార్థులకు టి డబ్ల్యూ ఎస్ పేరుతో కేవలం 564 మార్కులే విడ్డూరంగా ఉందన్నారు. అన్ని వర్గాలతో పోలిస్తే ఈ డబ్ల్యూ ఎస్ కేటగిరికి అత్యల్ప కటాఫ్ కేవలం 564 మార్కులు ఉండటం ఏంటని నరాల సుధాకర్ ప్రశ్నించారు. అదే మార్కులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సీట్లు రాలేదన్నారు. నిజంగా ఆర్థికంగా సామాజికంగా వెనుకబడినవారికి రిజర్వేషన్ దక్కకపోవడం శోచనీయం అన్నారు. విద్యార్థులు అర్హులైనా కూడా ఈ డబ్ల్యూ ఎస్ వలన తీవ్రంగా నష్ట పోతున్నాయని అన్నారు. రిజర్వేషన్ అసలైన ఉద్దేశం తారు మారైందని విమర్శించారు. ఈడబ్ల్యూఎస్ వలన బడుగు వర్గాల పిల్లలు నాణ్యమైన విద్యను కోల్పోతున్న పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర ఉపాధ్యక్షులు బుస్స ఆంజనేయులు అన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్ తో పాటు బుస్స ఆంజ నేయులు, పోల్కం గంగాకిషన్, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, విజయ్, బాలన్న,సదానంద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ నూతన కార్యవర్గాన్ని అభినందించిన రోటరీ క్లబ్




టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ సిటీ

రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ 2025 – 26 నూతన కార్యవర్గాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వంశీ ఇంటర్నేషనల్ హోటల్లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ డిజిపి అనురాగ్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్ష కార్యదర్శులు శ్యాం సుందర్ అగర్వాల్, గోవింద్ జవహర్ ఆధ్వర్యంలో జెమ్స్ నూతన అధ్యక్ష కార్యదర్శులు అయిన పాకాల నరసింహారావు, గంజి రమేష్ లను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ మాజీ అధ్యక్ష కార్యదర్శులు బీరెల్లి విజయరావు, రేకులపల్లి గంగారెడ్డి, ప్రసన్న కుమార్, చిలుక ప్రకాష్, జితేంద్ర మలాని, డాక్టర్ అంకిత్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనర్‌ను కలిసిన తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్



టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ క్రైమ్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ను తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ను స్వాగతిస్తూ అభినందించారు.

# 26 ఫిర్యాదులను స్వీకరించిన సిపి సాయి చైతన్య



టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ క్రైమ్

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదిదారుల నుంచి నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య 26 ఫిర్యాదులను స్వీకరించారు.నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల ఎస్.ఐ, సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా,మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని పోలీస్ కమిషనర్ తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలియజేశారు.

# తీన్మార్ మల్లన్నపై ఎడపల్లిలో పిర్యాదు..



టైమ్స్ ఆఫ్ వార్త – ఎడపల్లి

అసభ్యకరంగా మాట్లాడుతూ విషం చిమ్ముతున్న తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎడపల్లి పోలీస్ స్టేషన్ లో ఎడపల్లి మండల బిఆరెస్ పార్టీ, తెలంగాణా జాగృతి ఆధ్వర్యంలో నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్ లు మాట్లాడుతూ...తీన్మార్ మల్లన్న దమ్ముంటే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి తిరిగి గెలవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత ఒక మహిళా అని కూడా చూడకుండా అసభ్య పదజాలంతో, అనుచిత వాక్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పదవి, డబ్బు కాంక్షతో పిచ్చి పట్టిన వాడిలా ప్రవర్తిస్తున్న తీన్మార్ మల్లన్న పై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జాగృతి మండల నాయకులు దుబ్బాక రవీందర్ గౌడ్,ఆకుల సురేష్, గడ్డం శ్రీనివాస్, కృష్ణ, హైమద్,బాబా, కత్తుల శంకర్, మహబూబ్,భూపతి రెడ్డి,అల్తాఫ్, సురేష్ గౌడ్,దొడ్డి శ్రీనివాస్,ఇంతిహాస్,సలీమ్ బేగ్,ఉన్నారు.

# తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్

టైమ్స్ ఆఫ్ వార్త–బోధన్

ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసు కోవాలని బోధన్ పోలీస్ స్టేషన్లో సోమ వారం బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు.సీఐ వెంకట నారాయణను కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సి,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పెర్క రామకృష్ణ,బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్,శంకర్ పాల్గొన్నారు.



# ఎల్లంపల్లి బాధితులను మోసం చేసిన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:–



జిల్లాలోని ఎల్లంపల్లి బాధితులను కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు మోసం చేశాయని బిజెపి నాయకుడు రఘునాథ్ వెరబెల్లి, బిజెపి నేతలు ఆరోపించారు. జిల్లాలోని హాజీపూర్, లక్షట్టిపేట్ మండలాల్లో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ముంపు బాధితులకు పెండింగ్ లో ఉన్న బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ నాయకులు జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ముంపు ప్రాంత బాధిత ప్రజలతో కలిసి పాదయాత్రగా రాపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో కల తహశీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్ళి, కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎల్లంపల్లి బాధితులకు పెండింగ్ లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ హాజీపూర్ మండల తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఎమ్మెల్యేగా ఉండి, ప్రజలు బకాయిలు ఇప్పించడంలో పూర్తిగా విఫలం అయ్యారని, ఎమ్మెల్యేగా గెలిచిన 100 రోజుల్లో నష్ట పరిహారం ఇప్పిస్తానని వాగ్దానం చేసిన ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు 18 నెలలు గడిచిన ఇప్పటి వరకు బాధితులకు న్యాయం చేయలేదని ఆరోపించారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ముంపు బాధితులకు పరిహారం చెల్లించే వరకు బీజేపీ పోరాటం ఆగదు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గడ్డం స్వామి రెడ్డి, గాజుల ముఖేష్ గౌడ్, ఎనగందుల కృష్ణ మూర్తి, బియ్యాల సతీష్ రావు, అమిరిశెట్టి రాజ్ కుమార్, నాగిరెడ్డి హేమంత్ రెడ్డి, బందెల రవి గౌడ్, వీరమల్ల హరి గోపాల్, పట్టి వెంకట కృష్ణ, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, రమేష్ జైన్, మడిపల్లి సత్యం, కొట్టే ప్రశాంత్, చౌతకరి రాకేష్, రాయెల్లి మల్లేష్, అంకం శ్రీనివాస్, హనుమాండ్ల శ్రీనివాస్, రాజనర్సు, చిందం శ్రీనివాస్, బొడ్డు తిరుపతి లు పాల్గొన్నారు.

# జర్నలిస్టు క్రాంతి కుమార్‌కు జాతీయ మహానంది పురస్కారం



**తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ నేతృత్వంలో పలు రంగాల్లో విశేష కృషి చేసిన వారికి**

**అవార్డుల ప్రదానోత్సవం**

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:–




అంతర్జాతీయ సేవా సంస్థ తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ లోని రామయ్య ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆద్యంతం వీక్షకులను విశేషంగా అలరించాయి. ఈ వేకడుకల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన జర్నలిస్ట్ జాడ క్రాంతి కుమార్ (టైమ్స్ ఆఫ్ వార్త) దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ముఖ్య హాజరై, వివిధ రంగాలకు చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వివిధ రాష్ట్రాలకు చెందిన వారిని వివిధ పురస్కారాలతో ఘనంగా సత్కరించి, ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకర్షించాయి. అనంతరం ఈ వేడుకల్లో ఉత్తమ జర్నలిస్టుల విభాగంలో జిల్లాలోని మందమర్రి పట్టణానికి చెందిన జాడ క్రాంతి కుమార్ (టైమ్స్ అఫ్ వార్త) కు జాతీయ మహానంది అవార్డు – 2025ను అందజేసి, ఘనంగా సన్మానించారు. క్రాంతి కుమార్ జాతీయ అవార్డు అందుకున్న సందర్భంగా పలువురు జర్నలిస్టులు, స్నేహితులు, స్థానిక ప్రజలు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన జాడ క్రాంతి కుమార్ మాట్లాడుతూ, ఈ గౌరవం తనకు మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు అవగతం అయ్యేలా, నిజాలను వెలికి తీసేందుకు, న్యాయంగా సమాచారం ప్రజలకు, అదే విధంగా ప్రభుత్వానికి అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ అవార్డుతో జిల్లా జర్నలిస్టులకు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభించినట్లు పలువురు వ్యాఖ్యానించారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మాచవరం గౌరీశంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బట్టు శ్రీనివాస్ రావు లు పాల్గొన్నారు.

# చింతపండు నవీన్ నోరు అదుపులో పెట్టుకో..

**వీడొక బ్లాక్ మెయిలర్**

**అదే భాషను ఉపయోగిస్తే నాలుక చీరేస్తాం**

**క్షమాపణ చెప్పాలని డిమాండ్**



టైమ్స్ ఆఫ్ వార్తా – సదాశివనగర్

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి మహిళల పట్ల అనుచిత వాక్యాలు చేయడం దుర్మార్గమని నోరు అదుపులో పెట్టుకోమని చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న ను బీసీ నాయకులు హెచ్చరించారు.సదాశివనగర్ మండల బీసీ నాయకులు మాట్లాడుతూ.. సంప్రదాయ బద్ధకంగా మంచి సంస్కృతితో ఎన్నో ఏళ్లుగా తెలంగాణ పల్లెల్లో మహిళలను గౌరవించడం జరుగుతుందని నీలాంటి మూరు□లు ప్రజాప్రతినిధులుగా మారి మహిళల పట్ల ఆ విధంగా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. రెండు రోజుల క్రితం నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవితపై చేసిన వాక్యాలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు..ఏదో కేసీఆర్ను, రేవంత్ రెడ్డి ను తిడితే ఏమైతుంది అని మహిళల పట్ల అదే భాషను ఉపయోగిస్తే నాలుకను చీరేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా పద్ధతి నేర్చుకొని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏదో బీసీలను ఉద్ధరిస్తున్నట్టు మాట్లాడినంత మాత్రాన నిన్ను ఎవరు నమ్మరని నువ్వు ఒక బ్లాక్ మెయిలర్ అని నీ చరిత్ర అందరికి తెలిసిందేనని అన్నారు. తీన్మార్ మల్లన్న చింతపండు నవీన్ ను హెచ్చరించిన వారిలో సదాశివనగర్ మండల మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు, జిల్లా బీసీ నాయకులు కళాలి సాయ గౌడ్,ధర్మారావుపేట్ సురేష్, స్వామి గౌడ్, శ్రీరామ్ లింగం, గ్రామ కమిటీ అధ్యక్షులు లింగం,వడ్లూరు ఎల్లారెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షులు ఆస మహేష్ ఉన్నారు.

# కౌలు రైతు కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు




టైమ్స్ ఆఫ్ వార్త–గాంధారి

గాంధారి మండలంలోని ముదెల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో మరణించిన కౌలు రైతు కుటుంబానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పరామర్శతో పాటు ఆర్థిక సహాయం, ఉద్యోగ హామీ ఇచ్చారు. శనివారం జరిగిన ఈ విషాద ఘటనతో ముదెల్లి గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. అధికారిక కార్యక్రమాల వల్ల శనివారం వెళ్ళలేకపోయినప్పటికీ, ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు బాధిత కుటుంబాన్ని వ్యక్తిగతంగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్‌తో ఫోన్‌లో మాట్లాడి, బాధిత కుటుంబానికి తక్షణమే ₹5 లక్షల నష్టపరిహారం మంజూరు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా, వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి రైతు బీమా పరిహారాన్ని త్వరగా జమ చేయాలని సూచించారు. మృతుడి చిన్న కుమార్తె అఖిలకు ఉద్యోగ హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, ఇందిరమ్మ ఇల్లు కేటాయించడంతో పాటు, ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇటుకలు, కాంక్రీట్, స్టీల్ వంటి సామగ్రిని తన సొంత ఖర్చులతో సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాగుల మోహన్ యాదవ్, పెద్దకాపు దేశని సాయిలు, వడ్డే రాజయ్య, బల్గురి రాజు, కిరణ్ గౌడ్, పల్లె కాశీరాం, కర్రోల సాయిలు, పోకల రాము తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై బాధిత కుటుంబానికి తమ మద్దతు తెలిపారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తక్షణ స్పందనను గ్రామస్థులు అభినందించారు.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
మంగళవారం,
15-07-2025
4

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం జనకాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి సంతోష్ రావు పాఠశాలకు అందించిన 72 సైకిళ్ళను జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్యతో కలిసి విద్యార్థినీ, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, తాను చదువుకున్న పాఠశాలకు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సహకరించాలనే మంచి ఉద్దేశ్యంతో సంతోష్ రావు తాను చదివిన పాఠశాల లోని విద్యార్థులకు 72 సైకిళ్ళను అందించడం అభినందనీయ మన్నారు. పాఠశాలకు దూరంగా ఉన్న విద్యార్థినులు 42 మంది, విద్యార్థులు 30 మందికి ఈ సైకిళ్ళను అందించడం జరిగిందని, సైకిళ్ళ పంపిణీతో తరగతిలో విద్యార్థుల హాజరు శాతం మరింత పెరుగుతుందని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు విద్యాబోధన, సదుపా యాల కల్పనపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్షించడం జరుగుతుందని, మండల విద్యాధికారి తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించాలని సూచించారు. ప్రభుత్వం రాష్ట్రంలోని 3వ తరగతి విద్యార్థుల పఠనా సామ ర్థ్యాలపై జరిపిన సర్వేలో గతంలో 45 శాతం ఉంటే ప్రస్తుతం 75 శాతానికి చేరిందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రహరీగోడల నిర్మాణం, మెనూ అమలు, ఆట స్థలం, మూత్రశాలలతో పాటు లేని వాటిని సమకూర్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగేలా విద్యాబోధన చేయాలని, పఠనా సామర్థ్యాలను పెంపొందించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఆసక్తికి అనుగుణంగా విద్య బోధించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలకు ప్రభుత్వ సెలవు దినాలలో సైతం విద్యార్థులు స్వచ్ఛందంగా తరగతులకు హాజరయ్యారని, ఇదే క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించేలా అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. భూములు, ఆస్తులు, వ్యాపారాలు తాతల నుండి వచ్చినా, రాకపోయినా మనం నేర్చుకునే విద్యతో భవిష్యత్తును బంగారుమయం చేసుకోవచ్చునన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదులు ఇతర అన్ని సదుపాయాలు కల్పించి, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించి, నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు చదువులో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే తమ ఉపాధ్యాయులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, చదువుపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణ, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలకు కుర్చీల బహుకరణ




టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మైత్రి వనం మిత్ర బృందం సభ్యులు కుర్చీలు అందజేశారు. సోమవారం సీఐ వెంకట నారాయణ చేతుల మీదుగా వీటిని పాఠశాల ప్రధానోపాధ్యాయులుకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి సేవా కార్యక్రమాలు తోడ్పడుతాయని సీఐ అన్నారు .ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో ఏఈ కృష్ణ, ప్రధానోపాధ్యాలు బాల చందర్,పిఆర్ టియు రాష్ట్ర బాధ్యులు ఎంబెల్లి శంకర్,పిఆర్ టియు అర్బన్ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు కైరాన్, గంగాధర్,మైత్రివనం బృందం కృష్ణారెడ్డి, వెంకట్రాజిరెడ్డి,సతీష్,ప్రసన్న, పాఠశాల ఉపాధ్యాయ బృందం,సంజీవ్ కుమార్, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఆశ హాస్పిటల్ ను ప్రారంభించిన పిఏసి చైర్మన్ ఎమ్మెల్యే గాంధీ..

## కార్యక్రమం లో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్..



టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోనీ ఎల్లమ్మ బండలో నూతనగా ఏర్పాటు చేసిన ఆశ చారిటబుల్ ట్రస్టు వారి ఆశ హాస్పిటల్ ను పిఏ సి చైర్మన్ గాంధీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలుపుతూ మీరు ఏర్పాటు చేసుకున్న హాస్పిటల్ ద్వారా పేషెంట్లకు మంచి వైద్యం చేస్తూ పేదప్రజలకు అండగా నిలబడాలని కోరారు. హాస్పిటల్ బ్రాంచ్ ఇంచార్జి నరేష్ కుమార్ మాట్లాడుతూ మా ఆశ హాస్పిటల్ లో తక్కువ ప్రైస్ తో ట్రీట్మెంట్ అందించడం జరుగుతుందనీ తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రారంభోత్సవంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, జిల్లా గణేష్. బోయకిషన్. మహేష్. వెంకటకృష్ణ .ఆదర్శ్. ఆశా హాస్పిటల్ బ్రాంచ్ ఇంచార్జ్ నరేష్ కుమార్. డాక్టర్లు గోపి కిరణ్. సాయి శ్రీవత్సవ .అఖిలేష్ కుమార్ మౌర్య. బత్తుల మౌనిక. ఏ మౌనిక. హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

# జువ్వాడి పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ



టైమ్స్ ఆఫ్ వార్త-గాంధారి

గాంధారి మండలం జువ్వాడి గ్రామంలో సోమవారం రోజున స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్త కాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సంద నాయకులు మాట్లాడుతూ,ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వి చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు భూమేష్, మండల యూత్ ఉపాధ్యక్షులు వినయ్,ఇందిరమ్మ అధ్య క్షులు వెంకట్ రెడ్డి,ఎస్సీ సెల్ అధ్యక్షులు సంతోష్, సాయిలు,విడిసి చైర్మన్ శ్యామ్, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్,హెడ్ మాస్టర్ ప్రకాశ్,స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో భారీఎత్తున చేరికలు



టైమ్స్ ఆఫ్ వార్త- బిక్కనూర్

బిక్కనూర్ మండలంలోని తిప్పపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బి ఆర్ స్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి భారీ ఎత్తున చేరికలు జరిగాయి. దాదాపు 50 మంది కార్యకర్తలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమ్ రెడ్డి,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహా దారులు షబ్బీర్ అలీ కండువా కప్పి పార్టీ లోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చేరిన సభ్యులు మాట్లాడుతూ కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పనులను అలాగే వారు అందించే సంక్షేమ పథకాలు ఎంతో ఆకర్షిం చాయని తెలియజేశారు. షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో పార్టీ ని బలోపేతం చేస్తాం అని పార్టీ కోసం సాయ శక్తుల కృషి చేస్తామని చేరిన సభ్యులుతెలిపారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎంపీపీ గాల్ రెడ్డి, కుంట లింగారెడ్డి , సిద్ధ రాములు, మాజీ సర్పంచ్ స్వామి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గిద్ద హరిజనవాడలో విద్యుత్ వైర్లను సరి చేయండి



టైమ్స్ ఆఫ్ వార్త -బిక్కనూర్

బిక్కనూర్ మండలం గిద్ద హరిజనవాడలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతుండటతో ప్రజలు ఆ దారిలో వెళ్లేందుకు భయపడుతున్నారు. పిల్లలు, వృద్ధులు. ఈ దారి పై ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. పశువులు,వాహనాలు వెళ్తే విద్యుత్ షాక్ గురయ్యే ప్రమాదం ఉంది. కావున విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి చెయ్యాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఏఆర్పిలో యువకుని అదృశ్యం...

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



ఎడపల్లి మండలంలోని ఏఆర్పిక్యాంపు గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆదివారం నుండి కనబడడం లేదని యువకుని భార్య ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ముత్యాల రమ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.ఎడపల్లి మండలం లోని ఏఆర్పి క్యాంపు గ్రామానికి చెందిన పొన్నం నర్సిములు అనే యువకుడు గత రెండు రోజుల క్రితం వృత్తి రీత్యా డ్రైవింగ్ కు బయటకు వెళ్లి తిరిగి రాక పోవడంతో బంధువుల ఇళ్లలో వాకబు చేసినా వివరాలు లభించకపోవడంతో యువకుని భార్య పొన్నం కీర్తి సోమవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం ఎస్సై తెలిపారు. యువకుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమ పేర్కొన్నారు.

# ఎన్హెచ్ఆర్సి జిల్లా చైర్మన్‌గా శ్రీపతి రాములు గౌడ్



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా చైర్మన్ గా జిల్లాలోని నస్పూర్ పట్టణానికి చెందిన శ్రీపతి రాములు గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం శ్రీపతి రాములు గౌడ్ కు సంఘం రాష్ట్ర చైర్మన్ బద్ధిపడగ శ్రీనివాస్ రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీపతి రాములు గౌడ్ మాట్లాడుతూ, సంస్థ నియమ, నిబంధనలు పాటిస్తూ, సంస్థ లక్ష్యాల కోసం పని చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తానని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూస్తానన్నారు. ప్రతి పేదవాడికి న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని, పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని తెలిపారు. శ్రీరాంపూర్ కు చెందిన శ్రీపతి రాములు గౌడ్ కు అత్యుత్తమమైన నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా పలువురు అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# ప్రాథమికోన్నత పాఠశాలలో ఉచిత బుక్కులు, యూనిఫామ్ పంపిణి



టైమ్స్ ఆఫ్ వార్త -గాంధారి

గాంధారి మండలం లోని జువ్వడి ప్రాథమికొన్నత పాఠశాలలో సోమవారం రోజు విద్యార్థులకు నోటుబుక్కులు యూనిఫాంలు పంపిణీ చేసినట్లు బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబెర్ జువ్వడి శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత పుస్తకాల పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అయన అన్నారు. ఈ కార్యక్రమం లో వెంకట్ రెడ్డి, సాయిలి శ్యామ్, సంతోష్, భూమేష్,సాయిలు , శంకర,అనిల్,వినయ్, హెడ్ మాస్టర్ ప్రకాష్,ఉపాధ్యాయ బృందం, పంచాయతీ కార్యదర్శి చంద్ర కాంత్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే కృష్ణారావు...

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి



శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభినందించారు. సర్దార్ పటేల్ నగర్ శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల లో చదువుతున్న పలువురు విద్యార్థులు అంతరిక్ష వైజ్ఞానిక యాత్ర( నాసా యు ఎస్ ఎ) ను విజయవంతంగా పూర్తి చేసుకొని తిరిగి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని కలిసి విద్యార్థులు ఆశీర్వాదం తీసు కున్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు విద్యార్థులు సాయి లహరిక,శ్యామ్ స్వరూప్ లను సత్క రించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతరిక్ష వైజ్ఞానిక యాత్ర గురించి మాట్లాడుతూ పిల్లలలో విజ్ఞానపరంగా అభివృద్ధి సాధించడానికి ఇది ఒక చక్కని అవకాశం అన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులను ప్రోత్సహించి పంపినందుకు తల్లిదండ్రులను, నాసా ఇంచార్జీ నీ అభి నందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి ,సుభాషిణి ,ఎజిఎం శివరామకృష్ణ, ఆర్ ఐ పద్మజ,కో ఆర్డినేటర్స్ మురళీకృష్ణ,వేంకటశివ,డీన్ ఇంచార్జి లు తదితరులు పాల్గొన్నారు...

# వేతనం ఇప్పించిన రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

## -బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని గచ్చిబౌలి ఏరియా ఇంద్ర నగర్ లో గత కొన్ని రోజుల నుంచి భవన నిర్మాణ కార్మికులు, బిల్డింగ్ మేస్త్రి సురేష్ దగ్గర కార్మికులు సత్తి, బోలు, చోటు, అనే కార్మికులు గత కొన్ని సంవత్సరాల నుంచి భవన నిర్మాణ పనులు చేసేవారు, కొన్ని అనివార్య కారణాలవల్ల భవన నిర్మాణం మేస్త్రి సురేష్... ఆ ముగ్గురు కార్మికులకు ఈ సంవత్సరం మార్చ్ నెల రావలసిన వేతనం మొత్తం (ఒక లక్ష డేబై) వేలు 1,70,000/-వేల రూపాయలు రావాల్సి ఉండగా అవి ఇవ్వకపో వడంతో పలుమార్లు భవన నిర్మాణ మేస్త్రి సురేష్ ని ఎన్నిసార్లు అడిగినా ఈ ముగ్గురి కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ వాళ్లను ఏదో రకంగా ఇబ్బంది పెడుతూ పట్టించుకోక పోవడంతో, అడిగి విసుగు చెందిన కార్మికులు.. సత్తి, బోలు, చోటు, ఆ ముగ్గురు కార్మికులకు ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి భవన నిర్మాణ కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి భవన నిర్మాణ మేస్త్రి సురేష్ దగ్గరికి బయలుదేరి మేస్త్రి సురేష్ తో పలుమార్లు చర్చించి కార్మికులకు రావలసిన వేతనం మార్చ్ నెల (ఒక్కలక్ష డెబ్బై) వేల రూపాయలు.. 1,70,000/- వేల రూపాయలు ఇప్పించడం జరిగింది... భవన నిర్మాణ కార్మికులు మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక ధన్య వాదాలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, పాల్గొన్నారు...



since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



# మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలి

**డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు**

**మధిర నియోజకవర్గంలోని 4590 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 5 కోట్ల 93 లక్షల వడ్డీ లేని రుణాల చెక్కులు.**

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని





మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు.రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు సోమవారం చింతకానిలో పర్యటించి రాష్ట్ర సెర్ప్ సిఈఓ డి. దివ్య, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి మధిర నియోజకవర్గం స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ భీమా, ప్రమాద భీమా చెక్కులు, చింతకాని మండలానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చడం కోసం ప్రభుత్వం రెండు కీలక నిర్ణయాలు తీసుకుందని, ఇండ్లు లేని నిరుపేదలు ఉండటానికి వీలు లేదని, ప్రభుత్వ సహకారంతో ప్రతి పేదవాడికి ఇండ్లు ఉండాలని ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం చేపట్టిందని అన్నారు. గత పాలకుల హయాంలో ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నిర్వహించిన పాదయాత్రలో ఇండ్లులేక భయాందోళనలతో గడిపిన ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మొదటి దశలో 4 లక్షల 50 వేల ఇండ్లు 22 వేల 500 కోట్లతో మంజూరు చేశామని, ప్రతి ఇంటికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. ప్రతి వారం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు నిధులు విడుదల చేస్తుందని ఎక్కడా కూడా నిధుల సమస్య లేదని అన్నారు. గ్రామ పెద్దలను పిలిచి వారి సమక్షంలో పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావాలని అన్నారు. లిరాజకీయాలకతీతంగా పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. 93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యాన్ని రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ లను ఏర్పాటు చేసి కరెంట్ వ్యాపారం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని, మధిర నియోజకవర్గంలో 4 ఎకరాల విస్తీర్ణంలో 2 మెగా వాట్ల ప్లాంట్ ఉత్పత్తి ఒప్పందం చేశామని అన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు కోసం రైతులు భూమి ఇవ్వడానికి ముందుకు వస్తే ప్రతి సంవత్సరం 35 వేల రూపాయలు లీజు ఇస్తామని చెప్పారు. ఆర్టిసి సంస్థకు అద్దె బస్సులు మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రూ.2 లక్షల లోన్, బీమా రూ.10 లక్షల ప్రమాద బీమా కార్యక్రమం చేపట్టిందని అన్నారు. పాఠశాల ఏకరూప దుస్తులు మహిళా సంఘాల ద్వారా కుట్టించి సరఫరా చేస్తున్నామని, మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ ప్రతి మండలంలో అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. బహుళ సార్థక ప్రాజెక్టుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. 20 వేల కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సెర్ప్ సిఈఓ డి. దివ్య మాట్లాడుతూ అందుకున్న విజయం అందరికి పంచుద్దాం అనే నినాదంతో మహిళా సంఘాలలో నూతన సభ్యులను చేర్చాలని, 60 సంవత్సరాలు దాటిన వారు ప్రత్యేక సంఘం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. దివ్యాంగ సంఘం ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహిళా సంఘాలకు అందించిన రుణాలు 99 శాతం తిరిగి చెల్లిస్తున్నారని అన్నారు.

మహిళా సంఘాల సభ్యులు, సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఏకరూప దుస్తులు కుట్టడం, ఆర్టిసికు అద్దె బస్సులు, ఇసుక రీచ్ ల నిర్వహణ, షీ రాక్స్ సెంటర్, స్త్రీ టీ స్టాల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలను మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్నావన్నారు. మధిర నియోజకవర్గంలో 4 వేల 800 పైగా ఉన్న మహిళా సంఘాలకు 9 కోట్ల 80 లక్షల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. చింతకాని మండలంలో ఎంపికైన 539 ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు నేడు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వెంటనే గ్రౌండింగ్ చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన నుంచి గృహ ప్రవేశం వరకు ప్రభుత్వ యంత్రాంగం నుంచి పూర్తి సహకారం అందుతుందని, ఇసుక కూడా ఉచితంగా కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ వడ్డీలేని రుణాల కార్యక్రమాన్ని తెలంగాణలో మరోసారి డిప్యూటీ సీఎం ప్రవేశపెట్టారన్నారు. అనంతరం మధిర నియోజకవర్గంలోని 4,590 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 5 కోట్ల 93 లక్షల వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేయగా,అందులో చింతకాని మండలం 964 మంది సభ్యులకు ఒక కోటి 22 లక్షలు, బోనకల్ మండలం 853 మంది సభ్యులకు 95 లక్షలు, ముదిగొండ మండలం 1088 మంది సభ్యులకు ఒక కోటి 42 లక్షలు, ఎర్రుపాలెం మండలం 918 మంది సభ్యులకు ఒక కోటి 33 లక్షలు, మధిర మండలం 767అని సభ్యులకు ఒక కోటి రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను అందుకున్నారు.మధిర నియోజకవర్గానికి చెందిన 40 మంది స్వయం సహాయక సభ్యులకు చెందిన లోన్ భీమా 36 లక్షల 21 వేల వంద రూపాయల చెక్కును, బోనకల్ మండలం లబ్ధిదారునికి 10 లక్షల ప్రమాద భీమా చెక్కులను, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిఆర్డిఓ సన్యాసయ్య, ఎంపీడీఓచందు శ్రీనివాసరావు, తాసిల్దార్ కరుణాకర్ రెడ్డి, గిరధావర్లు రఘు ,జయకృష్ణ,జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డా. కళావతి బాయి, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ , సంబంధిత అధికారులు, మండల సమాఖ్య సభ్యులు, ఏ.పి.ఎం.లు, మహిళలు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# బ్యాండ్, వాయిద్య కళాకారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

బ్యాండ్, వాయిద్య కళాకారుల సంఘం (బివికేఎస్) రాష్ట్ర సదస్సు జులై 16న వరంగల్ జిల్లాలోని హన్మకొండ సిటిజన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరుగుతుందని, ఈ సదస్సుకు మండలం, జిల్లాలోని బ్యాండ్, వాయిద్య కళాకారులు అధిక సంఖ్యలో హాజరై, జయప్రదం చేయాలని సంఘం పట్టణ అధ్యక్షుడు రసూల్ కోరారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హన్మకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర సాంస్కృత మండలి చైర్మన్ వి వెన్నెల, రాష్ట్ర వృత్తి సంఘాల కన్వీనర్ ఎంవి రమణ తో పాటు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. బ్యాండ్, వాయిద్య కళాకారుల సంక్షేమం కొరకు బ్యాండ్ వాయిద్య ఫెడరేషన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బ్యాండ్ వాయిద్య టీంకు పూర్తి సబ్సిడీతో రెండు లక్షల ఆర్థిక సహాయం అందించాలని, వాయిద్య కళాకారులందరికి గతంలో మాదిరిగానే సాంస్కృతిక శాఖ గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. సాంస్కృతిక శాఖ నిర్వహించు కార్యక్రమాలలో వాయిద్య కళాకారులను భాగస్వాములు చేసి, ఉపాధి కల్పించాలని కోరారు. ప్రతి జిల్లాలో వాయిద్య వృత్తి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతి వృద్ధ కళాకారుడికి వృద్ధాప్య పింఛన్లు, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. బ్యాండ్ వాయిద్య కళాకారులకు పోలీసుల నుండి రక్షణ కల్పించాలని, వాయిద్య కళాకారులకు రవాణా పరమైన ఇబ్బందులు అరికట్టాలని కోరారు. వాయిద్య కళాకారుల కుటుంబానికి ఇండ్లు, ఇళ్ల స్థలాలు, మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తదితర సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు అందరం సంఘటితమై పోరాడేందుకు నిర్వహించు రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు షరీఫ్, ముఖ్య సలహాదారులు అక్తర్ పాషా, కోశాధికారి సలాం, కార్యదర్శులు ఎండి సుకూర్, వినోద్, చోటు, శశి అఖిల్ లు పాల్గొన్నారు.

# టిఎన్జీవో ఆధ్వర్యంలో ఘనంగా జిల్లా పంచాయతీ అధికారి జన్మదిన వేడుకలు

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



జిల్లా పంచాయతీ అధికారి డి వెంకటేశ్వర్ రావు జన్మదిన వేడుకలు టీఎన్జీవో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ రావు స్వగృహంలో టీఎన్జీవో ఆధ్వర్యంలో సోమవారం ఆయనను, ఆయన సతీమణిని శాలువాతో ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి పెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్న మల్లయ్య, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, నాయకులు శ్రీనివాస్, మంథని డీఎల్పిఓ సతీష్ కుమార్, ఎంపిఓ శ్రీపతి బాపురావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బి శ్రావణ్ కుమార్, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పూదరి నరేందర్, ఉపాధ్యక్షుడు ఏ సుమన్, అసోసియేట్ అధ్యక్షుడు గోళ్ళ శ్రీనివాస్, కోశాధికారి ఎన్ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పి మల్లేష్, బి వరప్రసాద్, జునేద్ లు పాల్గొన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ లక్ష్యం..

**టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్**





టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందని అన్నారు టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి,కొండాపూర్,లింగంపల్లి,హాఫీజ్ పెట్,మియాపూర్ మరియు మాదాపూర్ డివిజన్ పరిధిలో తమ దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన మౌలికవసతుల అభివృద్ధి పనుల గురించి అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు..ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి,నవీన్,రాము,శ్రీనివాస్,కిరణ్,ప్రశాంత్ నాయకులు, ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# జాతీయ అవార్డు గ్రహీత నెల్లి సదయ్యను సన్మానించిన సిఐటియు నేతలు

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

ఏరియాలోని కాసీపేట 1 గనిలో హెడ్ ఓవర్ మెన్ గా నిర్వహిస్తున్న నెల్లి సదయ్య ఆదివారం తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వరంగల్ లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పురస్కారం అందుకున్న సదయ్య ను సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం కాసీపేట 1 గని క్యాంటీన్లో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సదయ్యను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకట స్వామి, ఏఐసిడబ్ల్యుఎఫ్ జాతీయ కార్యదర్శి అల్లి రాజేందర్ లు హాజరై, సదయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సదయ్య సామాజిక సేవ కార్యక్రమాలలో తన వంతు కృషిగా తనకు తోచిన సహాయం చేయాలనే భావన కలిగిన వ్యక్తి అని, కష్టం వచ్చిన వారిని ఆదుకునే మనస్తత్వం కలవాడని కొనియాడారు. కరోనా సమయంలో తన వంతుగా ప్రజలకు సహాయ సహకారాలు అందించారని గుర్తు చేశారు. అదేవిధంగా ఇటీవల ఎస్ఎల్బీసీ శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ లో చిక్కుకుపోయిన కార్మికులను కాపాడుట కొరకు సింగరేణి రెస్క్యూ ఆధ్వర్యంలో నెలరోజులపాటు తన సేవలు అందించారని తెలిపారు. ఎల్లప్పుడూ కార్మికులకు అండగా ఉంటూ, కార్మిక సమస్యల పరిష్కారానికి ఆలోచిస్తూ, పనిలలో సైతం తోటి కార్మికులకు రక్షణ విషయంలో అనేక సలహాలు సూచనలు ఇస్తుంటారన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు నిరంతర నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గని అసిస్టెంట్ పిట్ కార్యదర్శి నాగవెల్లి శ్రీధర్, నాయకులు ప్రశాంత్, రమేష్, అలవాల సంజీవ్ లు పాల్గొన్నారు.



# ఐఎన్టీయుసీ కాసీపేట 1 గని పిట్ కార్యదర్శిగా సోగాల కన్నయ్య



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

సింగరేణి ఏరియాలోని కాసీపేట 1 గని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) పిట్ కార్యదర్శిగా సోగాల కన్నయ్య నియమితులయ్యారు. సోమవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయం నిర్వహించిన కార్యక్రమంలో ఈమేరకు కన్నయ్యకు యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంశెట్టి నరేందర్ లు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన ఐఎన్టీయూసీ జాతీయ నాయకుడు సంజీవ్ రెడ్డి,యూనియన్ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్, యూనియన్ నాయకులు కాంపల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, రాంశెట్టి నరేందర్, యూనియన్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిరంతరం కార్మికుల సమస్యల పరిష్కారానికి,హక్కుల సాధనకు యూనియన్ ఆదేశాల మేరకు పనిచేస్తానని తెలిపారు. రానున్న రోజులలో ఏరియాలో ఐఎన్టీయూసీ గెలుపే ధ్యేయంగా యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రహరీగోడ పనులను పరిశీలించిన ఆవుల రవీందర్ రెడ్డి..




టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ లోని పురాతన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన సొంత నిధులతో నిర్మిస్తున్న నూతన ప్రహరీగోడ, ఆంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట కొరకు జరుగుతున్న దిమ్మె పనులను స్థానిక బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పర్యవేక్షించడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సింగజోగి రామేశ్వర్ బిఆర్ ఎస్ పార్టీ నాయకులు రంగంపేట్ శ్రీనివాస్ ముదిరాజ్,జె.ప్రేమ్ కుమార్,దిట్టకవి గౌతమ్, మొహమ్మద్ బాబా,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

# ఘనంగా డా. మల్లు రవి పుట్టినరోజు వేడుకలు..

**శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ అధికార ప్రతినిధి**

**డా. సత్యం శ్రీరంగం, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు,**



టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, టీపీసీసీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డా.మల్లు రవి జన్మదినం సందర్భంగా వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం తో పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసిన, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు,అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు..

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
మంగళవారం,
15-07-2025



# పిల్లల బడి... మూతపడి

టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి



గాంధారి మండలం నేరల్ తండాలో చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించే పిల్లల బడి సుమారు 18 నెలలుగా మూతపడి ఉంది. అంగన్‌వాడీ భవనం నిరుపయోగంగా మూతపడి ఉందని పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరుకునే ప్రమాదంలో ఉందని వారు వాపోతున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతోందని గ్రామస్తులు తెలిపారు. దీంతో ఆర్థిక భారం పడుతోందని గ్రామస్తులు తెలిపారు. భవనం మూసివేయబడటం వల్ల పిల్లలకు, గర్భిణులకు అందించే సేవలకు ఆటంకం కలుగుతోందని వారు ఆందోళన చెందుతున్నారు. "అంగన్‌వాడీ భవనాన్ని పట్టించుకునే నాథుడే లేడు" అని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులు తక్షణమే స్పందించి, మూతపడిన అంగన్‌వాడీ భవనాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని, తద్వారా స్థానిక చిన్నారులకు, మహిళలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నిరుపయోగంగా అంగన్‌వాడీ భవనం సెంటర్‌ను ప్రారంభించాలని గ్రామస్తుల విజ్ఞప్తి



# టైమ్స్ ఆఫ్ వార్త కథనానికి స్పందించిన అటవీ శాఖ అధికారులు

## గాయపడిన ఆవుకు చికిత్స

టైమ్స్ ఆఫ్ వార్త-గాంధారి






గాంధారి మండలంలోని కాయితీ తాండ శివారులో ఆవుపై దాడి ఘటనపై 'టైమ్స్ ఆఫ్ వార్త' కథనానికి అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించారు . ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సునీత ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాయితీ తాండ ఆవు కాపరులను ఘటనా స్థలానికి తీసుకెళ్లి దాడి జరిగిన తీరును పరిశీలించినట్లు తెలిపారు. దాడిలో గాయపడిన ఆవుకు చికిత్స చేయించామని, ఆవు యజమాని మంజ శంకర్‌తో మాట్లాడటం జరిగిందని పేర్కొన్నారు.గ్రామస్తులు ఎవరూ భయాందోళన చెందవద్దని సునీత సూచించారు. పులి ఎవరికైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆమె గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ సుష్మిత, బేస్ క్యాంపు ప్రభాకర్, సాయిలు, గ్రామస్తులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ పురస్కారానికి మెతుకు ఉప్పలయ్య

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ



తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డు -2025 జాతీయ పురస్కారాన్ని మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఓల్డ్ నేరేడ్ మెట్‌కు చెందిన మెతుకు ఉప్పలయ్య అందుకున్నారు. వరంగల్ రామయ్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో ఈ అవార్డును ఆయనకు అందజేశారు.సామాజిక సేవలో అందించిన సేవలను గుర్తించి ఈ పురస్కారం లభించింది. పేదల సంక్షేమం, కార్మికులు, ప్రైవేట్ ఉద్యోగుల హక్కుల కోసం సాగించిన పోరాటం, అవినీతి నిర్మూలనలో పోషించిన పాత్ర తదితర అంశాలు గుర్తింపుగా నిలిచాయి. తన భార్య విజయలక్ష్మి నిస్వార్థంగా కుటుంబానికి చేసిన సేవలే తన స్ఫూర్తిగా మారాయని ఉప్పలయ్య పేర్కొన్నారు. ఆయన స్థాపించిన "తెలంగాణ సెక్స్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్" 2012లో రిజిస్ట్రేషన్ పొందిన తొలి సెజ్ అసోసియేషన్‌గా గుర్తింపు పొందింది. ఈ సత్కారాన్ని తన కుటుంబం, ముఖ్యంగా భార్య విజయలక్ష్మి కి అంకితమిస్తున్నట్టు ఉప్పలయ్య హృదయపూర్వకంగా తెలియజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గౌరిశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# అంతడుపుల నాగరాజుకు అపూర్వ స్వాగతం



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యుడిగా నియమితులై తొలిసారి పట్టణానికి విచ్చేసిన అంతడుపుల నాగరాజుకు ఒర్రెగడ్డ పాఠశాల 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, పాఠశాల పూర్వ విద్యార్థులు కళాకారులు, అభిమానులు, సోమవారం ఘనంగా అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజక వర్గం లోని ఇందారం వద్ద ఆయనకు ఘనంగా స్వాగతం పలికి ఇందారం నుండి వాహనాలతో ర్యాలీగా పట్టణంలోని పాతబస్టాండ్ కు చేరుకున్నారు. పాత బస్టాండ్ వద్ద నాగరాజు కు పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు, ఆయన అభిమానులు ఘనంగా స్వాగతం పలికి, బాణసంచ పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆచార్య జయశంకర్ విగ్రహానికి నాగరాజు నివాళులు అర్పించారు. అనంతరం పాత బస్టాండ్ నుండి పట్టణంలోని మంజునాథ గార్డెన్ వరకు ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మార్కెట్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులు అర్పించారు. స్థానిక మంజునాథ గార్డెన్ లో ఏర్పాటు చేసిన సమావేశం కళాకారులు, పూర్వ విధ్యార్థులు, అభిమానులు గజమాలతో నాగరాజు ను ఘనం గా సత్కరించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణ మలిదశ ఉద్యమంలో అనేక మంది కళాకారులు, ఉద్యమ కారులు తమ జీవితాన్ని త్యాగం చేసి, రాష్ట్ర సాధన కోసం ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. స్వరాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర చిరస్మరణీయమని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యమకారుల త్యాగాన్ని విస్మరిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వారిని గుర్తించి, ప్రత్యేక గుర్తింపు అందించి, అక్కున చేర్చుకుంటుందని కొనియాడారు. పదవి ఏదైనా ఇన్నేళ్ల తన శ్రమకు దక్కిన గౌరవమని భావోద్వేగానికి లోనయ్యారు. నటరాజ్ కళా నిలయం నుండి మొదలైన తన కళా ప్రస్థానంలో ఎందరో కళాకారులు, సన్నిహితులు, తన వెన్నంటి నడచి, ప్రోత్సహించారని తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ సలహా సభ్యుడిగా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒర్రెగడ్డ పాఠశాల పూర్వ విద్యార్థులు, నాగరాజు అభిమానులు, సన్నిహితులు, స్నేహితులు, కళాకారులు పాల్గొన్నారు.

# బహుజన ఆలయ్ బలయ్‌కు మంత్రికి ఆహ్వానం

టైమ్స్ ఆఫ్ వార్త-బాన్సువాడ

కామారెడ్డి జిల్లా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జూలై 27న జరగనున్న "రాజ్యాంగ పరిరక్షణ బహుజన ఆలయ్ బలయ్" కార్యక్రమానికి కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్యలను ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్ సోమాజిగూడలో మంత్రి వివేక్‌ను కలిసి సంఘం జిల్లా అధ్యక్షుడు బొంద రాజ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టెంకి బాల్, మాచారెడ్డి మండల అధ్యక్షులు మారుపాక లక్ష్మి రాజం, బీబీపేట ఉపాధ్యక్షులు రొద్ద రాజు, కామారెడ్డి టౌన్ సెక్రటరీ దెబ్బటి రవితేజ, సదాశివనగర్ ప్రధాన కార్యదర్శి బోండ్ల రాజశేఖర్ తదితరులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని



మంత్రి హామీ ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

# నాడు హామీ... నేడు కార్యరూపం

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

చింతకాని మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన పలు సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్న నెర్సుల ఎల్లయ కుటుంబానికి, తెలంగాణ ఉపముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చింతకాని మండల నాయకులు వారి కుటుంబాన్ని సందర్శించి ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఆ హామీని కార్యరూపంలోకి తేవడంతో, ఎల్లయ్య భార్య నరసమ్మ కు ఇందిరమ్మ ఇల్లు పట్టాను అందజేస్తూఆ కుటుంబానికి భరోసా ఇచ్చిన భట్టి విక్రమార్క చేతుల నుండి ఇల్లు మంజూరు పత్రాన్ని అందుకోవడం మాకు సంతోషంగా ఉందని వాళ్ళ సతీమణి హర్షం వ్యక్తం చేశారు.



# విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట

## నూతన విద్యుత్ ట్రాన్స్ఫారం ప్రారంభించిన డివిజనల్ ఇంజనీర్ బండి శ్రీనివాసరావు

టైమ్స్ ఆఫ్ వార్త - బోనకల్




మండల పరిధిలోని రాపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ వారు రైతుల యొక్క సహకారంతో పొలం బాట నిర్వహించారు పొలం బాట యొక్క ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు వైరా డివిజనల్ ఇంజనీర్ బండి శ్రీనివాసరావు, వైరా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిరణ్ కుమార్ వివరించారు. డివిజనల్ ఇంజనీర్ బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల పొలాల్లో విద్యుత్ వైర్లు వేలాడుతున్న, విద్యుత్ స్తంభాలు వంగిన ,విద్యుత్ ట్రాన్స్ఫారాలు కాలిపోయిన ఈ ప్రక్రియ నిరంతరం ఉంటదని రైతులు విద్యుత్ శాఖ వారి యొక్క సహకరిస్తూ మీ యొక్క సమస్యలను పరిష్కరించుకోవాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ బోనకల్ ఏఈ మనోహర్ రావినూతల లైన్స్మెక్టర్ నరసింహారెడ్డి ,మోటమర్రి లైన్స్మెక్టర్ పి రవికుమార్, అసిస్టెంట్ లైన్మెన్ అర్జున్ ,అన్మాండ్స్ సురేష్, రమేష్, ఇఆర్టి గణేష్ ,రైతులు చావ రవి,తాళ్లూరు పుల్లయ్య,పారుపల్లి నాగేశ్వరావు, కట్ట సంజీవరావు, గుడిద కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాల దాట్లలో ఆషాఢ మాసం గోరింటాకు సంబరాలు

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి



దంతాలపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల దాట్లలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆషాఢ మాస గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో ఈ వేడుకను జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గోపు అనిత కుమారి, కే కవిత గారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించడం జరిగింది.గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలోని వేడి తగ్గించి శరీరాన్ని చల్లబరుస్తుందని, చర్మవ్యాధుల భారీ నుండి కాపాడుతుందని, గోర్ల బలోపేతానికి కృషి చేస్తుందని , ఒత్తిడిని తగ్గించడానికి మరియు శరీర శక్తిని సమతుల్యం చేయడానికి సహాయపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ కే పాషా, ఉపాధ్యాయులు చింతల సురేష్, జి అనిత, కే రవీందర్, కే కవిత , స్కావెంజర్ ఉమా , విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ సర్టిఫైడ్ స్పీకర్‌గా శ్వేత

టైమ్స్ ఆఫ్ వార్త - బోనకల్



మండల పరిధిలోని షైన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఏ శ్వేత ఎంపిక అయ్యారు.ప్రముఖ వ్యక్తిత్వ వికాస సంస్థ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న శిక్షణలో శ్వేత పాల్గొన్నారు. జీవన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ఆత్మ విశ్వాసం వంటి అంశాలతో పాటు విద్యార్థుల్లో కెరియర్ గైడెన్స్, యువత లో పర్సనాలిటీ మానేజ్‌మెంట్, వయోజనుల్లో వృత్తిపరం అయిన మరియు వ్యక్తిగత సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ శిక్షణ ఉపకరిస్తుందని శ్వేత తెలిపారు. ఈ అవకాశం ఇచ్చినందుకు ఇంపాక్ట్ ఫౌండేషనుకు, నిపుణుడు గంపా నాగేశ్వరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# నాగరాజు చిత్రపటానికి నివాళులర్పించిన జమ్ముల

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని



చింతకాని మండలం వందనం గ్రామంలో సిపిఐ పార్టీ గ్రామ నాయకులు ఆవుల నాగరాజు దశ దినఖర్మలో ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి .ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూచిపూడి రవి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి సింగారపు సత్యనారాయణ, గ్రామ శాఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన జి నాగరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి తమ తాతల నుండి వారసత్వంగా వస్తున్న భూమి వివరాలు రెవెన్యూ రికార్డులలో తప్పుగా నమోదు చేయడం జరిగిందని, సవరించి, తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండలం జంగాల్పేట్ గ్రామానికి చెందిన మరుశెట్టి లక్ష్మయ్య తమకు చెందిన పట్టా భూమిని ఎలాంటి సమాచారం లేకుండా ఇతరులు పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మత్స్యకారులు తమ దరఖాస్తులో మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వం పొంది, చెరువులలో చేపలు పట్టే వారు లైసెన్స్ పొంది, గోదావరి నదిలో చేపలు పట్టడం వలన తాము నష్టపోతున్నామని, ఆ లైసెన్స్లను రద్దు పరిచి తమను ఆదుకోవాలని కోరారు. మందమర్రి మండలం చిర్రకుంట గ్రామానికి చెందిన దుర్గం ప్రమీల నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం పెద్దనపల్లి గ్రామంలోని 10వ వార్డు మాజీ కౌన్సిలర్ కొక్కెర చంద్రశేఖర్ తమ వార్డులో గతంలో అంగన్వాడీ కేంద్రం ఉండేదని, గ్రామాల విభజన సమయంలో తీసివేశారని, తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆదివాసీ నాయకపోడు హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు తమ దరఖాస్తులో అడవికి ఆదివాసీలను దూరం చేసే జిఓ నెంబర్ 49ను రద్దు చేయాలని కోరారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ప్రతినిధులు జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పోస్టులను భర్తీ చేయాలని, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మందమర్రి మండలం క్యాతనపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి గోపు రాజం మండల తహశీల్దార్ కార్యాలయం శిథిలావస్థలో ఉందని, వర్షం పడితే రెవెన్యూ రికార్డులు పాడయ్యే ప్రమాదం ఉందని, ఈ విషయమై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖనికి చెందిన ముడుతన పెల్లి సారయ్య తనకు జిల్లాలోని కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులో గల భూమి నిషేధిత జాబితాలో చూపుతుందని, తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో 39 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డిప్యూటీ ముఖ్యమంత్రికి వినతి

## రిటైర్డ్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల పెన్షనర్లు.

**టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని**

చింతకాని మండల కేంద్రానికి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసినటువంటి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కు జిల్లాకు చెందిన 50 మంది రిటైర్డ్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ పెన్షనర్లు వినతి పత్రం అందజేశారు. తమకు గత 15 నెలలగా రిటైర్మెంట్ అయినప్పటికీ వెంటనే రావలసినటువంటి బెనిఫిట్స్ కమిటేషన్ ,గ్రాటివిటీ, జిపిఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్, ఈ ఎల్ ఎన్ క్యాష్మెంట్ బెనిఫిట్స్ ఇంతవరకు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ వినతి పత్రం అందజేసినారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు పరిస పుల్లయ్య, రాయల రవికుమార్, వీరభద్రం, అంబటి శాంతయ్య, కంచుమర్తి పుల్లయ్య, వీరపనేని శ్రీనివాసరావు, చింతమనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ కమ్యూనిస్టు అమర్లపూడి సుబుద్ధి

**టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని**



వందనం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు అమర్లపూడిసుబుద్ధి తెల్లవారుజామున ఆకస్మికంగా మరణించడం జరిగింది. వారి భౌతికయాన్ని కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ ,మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు ,మండల కార్యదర్శి రాచబంటి రాము పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో వందనం శాఖ సానుభూతిపరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నానికి ప్రయత్నించిన నిందితుల అరెస్టు

## రిమాండ్ కు తరలింపు.. రామకృష్ణాపూర్ ఎస్ఐ జి రాజశేఖర్

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**




పాత కక్షలతో పథకం ప్రకారం వ్యక్తిని హత్య చేయాలని ప్రయత్నించిన ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకొని, రిమాండ్ కు తరలించడం జరిగిందని రామకృష్ణాపూర్ ఎస్ఐ జి రాజశేఖర్ తెలిపారు. సోమవారం జిల్లాలోని రామకృష్ణాపూర్ పట్టణ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్త తిమ్మాపూర్ లో నివాసం ఉంటున్న దుర్గం వెంకటేష్ అదే గ్రామానికి చెందిన కొమ్ము సంతోష్ తో గతంలో డాక్టర్ విషయంలో చాలాసార్లు గొడవలు జరగగా, ఆదివారం సంతోష్ తన భార్యతో కొత్త తిమ్మాపూర్ లో పోచమ్మ దేవాలయానికి వచ్చినప్పుడు వెంకటేష్ అతనితో గొడవపడి, బూతులు తిడుతూ, చంపుతా అని బెదిరింపులకు పాల్పడ్డాడు. అదే రోజు రాత్రి సంతోష్ కు ఫోన్ చేసి, ఇంటికి రమ్మని పిలవడంతో, వెంకటేష్ ఇంటికి వెళ్ళిన సంతోష్ పై వెంకటేష్, వెంకటేష్ తండ్రి దుర్గం రాయపోషం, కర్ర కత్తితో దాడి చేయగా, వెంకటేష్ తల్లి శారద వారికి సాయం చేసింది. దీంతో సంతోష్ కడుపులో, వీపులో, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, దాడికి పాల్పడిన వెంకటేష్, అతని తండ్రి రాయపోషం, తల్లి శారద లను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి, మంచిర్యాల కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒప్పంద పద్దతిన పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

## ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసేందుకు కంట్రోల్ ఆఫ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్-తెలంగాణ క్రింద ఒప్పంద, గౌరవ వేతన పద్దతిన పోస్టుల భర్తీ కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఒప్పంద పద్ధతిన ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, గౌరవ వేతన పద్ధతిన సీనియర్ రెసిడెంట్ పోస్టును తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయడం జరుగుతుందని, 31 మార్చి, 2026 వరకు, అవసరం మేరకు, రెగ్యులర్ ఉద్యోగుల భర్తీ వరకు పని చేయవలసి ఉంటుందని తెలిపారు. అర్హత గల అభ్యర్థులకు జూలై 18న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు https://www.gmcmancherial.org వెబ్సైట్లో సంప్రదించవచ్చునని తెలిపారు.

# బోర్లం గ్రామ అభివృద్ధిపై సీతక్కకు వినతి

**టైమ్స్ ఆఫ్ వార్త-బాన్సువాడ:**



జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కను బోర్లం గ్రామ ప్రజాప్రతినిధులు ప్రజాభవన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పెద్దపట్లోళ్ల శ్రావణి దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మన్నే విటల్, దడిగే అహ్మద్, షేక్ మహబూబ్, యువజన నాయకుడు ఖాదిరెడ్డి చిన్ను తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# ఆషాడ మాస వనభోజనం..!

**టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి**



హౌసింగ్ బోర్డ్ కాలనీ రిజిస్టర్ సొసైటీ సభ్యులందరూ ఆదివారం నాడు ఆషాడ మాస వన భోజన కార్యక్రమం బంగారు గూడెం లో ఉన్నటువంటి చందా రవికిరణ్ మామిడి తోటలో జరుపుకోవడం జరిగినది ఇట్టి కార్యక్రమమును సంతోషంగా ఆహ్లాదంగా ఉత్సవంగా కాలనీ సభ్యులందరూ జరుపుకోవడం జరిగినది పూర్వకాలం నుండి ఈ ఆషాడ మాసం లో వనభోజనాల కార్యక్రమము జరుగుతుంది. హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్నటువంటి కుటుంబాలన్నీ సాంప్రదాయబద్ధంగా అన్ని పండగలను జరుపుకున్నట్టే ఇలాంటి కార్యక్రమాలు జరుపుకుంటున్నారు. ఇట్టి విషయాన్ని హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రెసిడెంట్ కట్ల వెంకన్న తెలిపినారు

# యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే డిఈఈటి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**



జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డిఈఈటి) ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాస్ డి, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సిహెచ్ దుర్గాప్రసాద్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి లతో కలిసి డిఈఈటి సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, డిఈఈటి తో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం జరుగుతుందని తెలిపారు. డిఈఈటి యాప్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలు ప్రతి రోజు నవీకరించబడతాయని, ఈ వేదికతో అభ్యర్థులు తమ విద్యార్హత, అనుభవం ఆధారంగా తగిన ఉద్యోగాల కోసం శోధించవచ్చునని తెలిపారు ఈ యాప్ లో ఉద్యోగ నోటిఫికేషన్లు, ఇంటర్వ్యూలు, ఉద్యోగ మేళాలు, రెస్యూమ్ తయారీ, కెరీర్ మార్గదర్శకత వంటి సదుపాయాలు పొందుపర్చడం జరిగిందని వివరించారు. నిరుద్యోగ యువత ఈ యాప్ ను వినియోగించుకొని ఉపాధి పొందాలని, అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీ చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి

**టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:**

బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని రుద్రూర్ మండలం అంబెం గ్రామంలో తెలంగాణ మోడల్ స్కూల్ ,జూనియర్ కాలేజ్ ను , బాలికల హాస్టల్ ను,వర్ని మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, వర్ని మండలం కోటయ్యక్యాంప్ గ్రామంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలికల వసతి గృహం,వర్ని మండలం కోటయ్యక్యాంప్ గ్రామంలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల,వర్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలను అకస్మీకంగా తనిఖీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు. ఈ సందర్భంగా వంట గది, సరుకుల నిల్వ గదులను తనిఖీచేసి, సరుకులు, కూరగాయల నాణ్యతను స్వయంగాపరిశీలించిన పోచారం . మేను ప్రకారం రోజు ఆహార పదార్థాలను పెడుతున్నారాని విద్యార్థినులను అడిగి తెలుసుకుని విద్యార్థులకోసంవండిన అల్పాహారాన్ని తనే స్వయంగా తిని నాణ్యతను పరిశీలించిన పోచారం .ఈ కార్యక్రమంలో వర్ని మండల మార్కెట్కమిటీఅధ్యక్షులు సురేష్ బాబా వర్ని, రుద్రూర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, తదితరులు, పాల్గొన్నారు .



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులతో సమీక్ష

**టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:**



బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండల కేంద్రంలో జనరల్ ఫంక్షన్ హాల్లో వర్ని, చందూర్, మోస్రా, కోటగిరి, రుద్రూర్, పోతంగల్ మండలాల ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంపై సంబంధిత అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాలరాజు ,బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో. ఈకార్యక్రమంలో వర్ని మండల మార్కెట్ కమిటీ అధ్యక్షులు సురేష్ బాబా , కోటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ గైక్వాడ్ హనుమంతు ,వర్ని, చందూర్, మోస్రా, కోటగిరి, రుద్రూర్, పోతంగల్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

# నసుల్లాబాద్ మండల కేంద్రంలో బహుజన అలైబలై కరపత్రాల ఆవిష్కరణ..

**టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ**




ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహుజన ఆలయ్ బలయ్ కామారెడ్డి లో జరిగే కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ సంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు మైషయ్య,,కామారెడ్డి జిల్లా అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు గైని రవి ,బాన్స్ వాడ డివిజన్ అంబేద్కర్ సంగం ఉపాధ్యక్షులు మన్నే సాయిలు అంబేద్కర్ సంగం నాయకులు, మన్నే సురేష్ లఆధ్వర్యంలో నసుర్ల బాడ్ మండలకేంద్రము కు విచ్చేసినసుర్ల బాడ్ అల్ ఇండియా అంబేద్కర్ సంగం అధ్యక్షులు ఊళ్లేంగ కిరణ్ కుమార్, మండల అంబేద్కర్ సంఘమాజీ అధ్యక్షులు మామిడి భూమయ్యఆధ్వర్యంలోబహుజన అలాయ్ బలయ్పోస్టర్ఆవిష్కరణ చేయడం జరిగింది .కామారెడ్డి లో జరిగే అలాయ్ బలయ్ ని జయ ప్రదం చేయగలరని కోరారు. బైరా పూర్ అంకోల్ క్యాంపు కార్యక్రమా లలో,నసుర్ల బాడ్ మండలాల అంబేద్కర్ సంఘం సభ్యులు ఊళ్లేంగ రాములు, శివకుమార్, మామిడి సన్నీ, లక్ష్మణ్, సతీష్, తదితరులు,పాల్గొన్నారు.

TIMES OF VARTHA (15-07-2025)12_times of varha main (13-2).qxd 7/15/2025 6:08 AM Page 8



## రేపు తెలుగు రాష్ట్రాల సిఎంల భేటీ

(మొదటి పేజీ తరువాయి)..



బిసి రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలవడంతో పాటు పార్టీ అధిష్ఠానంతో భేటీకానున్నట్టు తెలిసింది. ఈనెల 15న సాయంత్రం ఢిల్లీలో జరిగే మాజీ ప్రధాని పి.వి నరసింహారావు సంస్మరణ సభలో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎపి సిఎం చంద్రబాబు నాయుడు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో.. ఇరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకే వేదికను పంచుకునే అవకాశం ఉంది.

## తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా అపరేష్ కుమార్ సింగ్

(మొదటి పేజీ తరువాయి)..

తెలంగాణ హైకోర్టుకు, జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావును జారండ్ నుంచి త్రిపురకు, జస్టిస్ కెఆర్ శ్రీరాంను మద్రాస్ నుంచి రాజస్థాన్‌కు బదిలీ అయ్యారు. అలాగే మధ్యప్రదేశ్ యాక్టింగ్ సీజే జస్టిస్ సంజీవ్ సచ్ దేవ్ ఆ రాష్ట్రానికి సీజేగా, ఢిల్లీ హైకోర్టు జడ్జీ జస్టిస్ విభు బక్రూ.. కర్ణాటక సీజేగా, పాట్నా హైకోర్టు యాక్టింగ్ సీజే జస్టిస్ అశుతోష్ కుమార్..గౌహతి సీజేగా, పాట్నా జడ్జీ జస్టిస్ విపుల్ మనుభారు పంటోలిని..పాట్నా సీజేగా, హిమాచల్ ప్రదేశ్ జడ్జీ జస్టిస్ టీఎస్ చౌహాన్..జారండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.



# ప్రతి పేదవాడికి రేషన్ కార్డు..




(మొదటి పేజీ తరువాయి)..

తెలంగాణ వ్యాప్తంగా గడిచిన పదేండ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, సన్నబియ్యంతో అన్నం పెట్టాలన్న ఆలోచన చేయలేదని చెప్పారు. రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామనీ, తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్ల రైతు భరోసాను రైతుల ఖాతాలో జమ చేశామని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్మించిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు 70 సంవత్సరాలు గడిచినా చెక్కుచెదరలేదని, మూడేండ్లలో కట్టిన కాళేశ్వరం మాత్రం అప్పుడే కూలిపోయి ందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులే ఇప్పుడు రైతులను ఆదుకుంటున్నాయన్నారు. మహిళా సాధికా రతలో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాల్లోని ప్రతి ఆడబిడ్డకూ రెండు చీరలు ఇస్తున్నామని, రూ.21 వేల కోట్లు జీరో వడ్డీతో బ్యాంకు రుణాలు ఇప్పించామని సీఎం అన్నారు. 600 బస్సులు కొనుగోలు చేసి మహిళల ద్వారా ఆర్టీసీకి కిరా యికి ఇప్పించి వారిని యజమానులను చేశామని తెలిపారు. మహిళల ద్వారానే సోలార్ విద్యుత్తు యూనిట్లు ఏర్పాటు చేసే విధంగా 1000 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు ఇస్తున్నామన్నారు. రెండున్నర సంవత్సరాల తమ పాలన పూర్తయ్యేలోపు లక్ష మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్

మూడు అడుగులున్న స్థానిక నేత ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు అవకాశం ఇచ్చినా తుంగతుర్తికి నీళ్లు ఎందుకు తేలేదంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని సీఎం సూటిగా ప్రశ్నించారు. తుంగతుర్తికి నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదంటూ బీఆర్ఎస్ నేతకు ఈ సందర్భంగా చురకలంటించారు. దొర ముందు చేతులు కట్టుకుని గ్లాస్‌లో సోడా పోయడమే నీకు తెలుసంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై మండిపడ్డారు. సొంత మండలానికి ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీస్‌లే కాదు.. పోలీస్ స్టేషన్ సైతం తెచ్చుకోలేని ఘనత బీఆర్ఎస్ నేతలదంటూ వ్యంగ్యంగా అన్నారు. పోరాట యోధులను అందించిన గడ్డ నల్గొండ అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. నాడు గంజికి లేని మూడు అడుగుల నాయకుడు.. నేడు బెంజి కార్లలో తిరుగుతున్నారంటూ జగదీశ్వర్ రెడ్డిపై వ్యంగ్య బాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి సంధించారు. తెలంగాణలో కొత్తగా 3. 58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ పంపిణి చేస్తున్నట్లు వివరించారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి చేకూరతుందన్నారు. తెలంగాణలో మొత్తం 95. 56 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.

### గోదావరి జలాలతో సస్యశ్యామలం

తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ద్వారా గోదావరి జిల్లాలు తీసుకొచ్చి సస్యశ్యామలం చేస్తామని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బునాదిగాని కాలువలను పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు మహేష్ కుమార్‌గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావు, శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే లు సామేల్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, మురళినాయక్, యశస్వినిరెడ్డి, శంకర్ నాయక్, లక్ష్మారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

## పేదల కోసమే శ్రమించిన మనోహర్

### రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు

టైమ్స్ ఆఫ్ వార్త - పాల్వంచ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)



పేద ప్రజల బాగోగుల కోసం జీవితాంతం శ్రమించిన నాయకుడు పైడిపల్లి మనోహర్ అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నేత పైడిపల్లి మనోహర్ దశదినకర్మల సందర్భంగా సోమవారం పాల్వంచ పట్టణంలోని ఘట్టాయిగూడెంలో ఆయన నివాసానికి చేరుకున్న కొత్వాల, ఆయన కుమారుడు, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పైడిపల్లి మహేష్‌తో కలిసి మనోహర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనోహర్ పాల్వంచ ప్రజల కష్టసుఖాల్లో పాల్గొంటూ, సహృదయంతో సేవలు అందించిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, వై. వెంకటేశ్వర్లు, ఉండేటి శాంతి వర్ధన్, మాలోత్ కోటి నాయక్, నల్లమల సత్యం, కాపర్తి వెంకటాచారి, షేక్ చాంద్ పాషా, డిష్ నాగేశ్వరరావు, శ్రీలత రెడ్డి, అరుణ రెడ్డి, ఎస్.కే. భాష, మల్లికార్జున్, దప్పు రాము, గద్దె రాఘవయ్య, అలెక్స్, జగన్నాథం, అజిత్, నరేష్, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాలిపేరు కాలువ గేట్లు ఎత్తిన ఎమ్మెల్యే వెంకట్రావు

టైమ్స్ ఆఫ్ వార్త -భద్రాద్రి కొత్తగూడెం జిల్లా



ఖరీఫ్ సీజన్‌లో పంటలకు సాగునీరు అందించేందుకు చర్ల మండలంలోని పెదమిడిసిలేరు గ్రామంలో తాలిపేరు ప్రాజెక్టు కాలువ గేట్లను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్వయంగా ఎత్తి నీటి విడుదల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలిపేరు ప్రాజెక్టు ద్వారా 5.0 టి.ఎం.సి నీటిని వినియోగించి చర్ల, దమ్ముగూడెం మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన సుమారు 25,000 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమయానికి నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, పాల్గొన్నారు.

## కేటీఆర్‌ని కలిసిన బాన్సువాడ బారసానేతలు..



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ

బాన్సువాడ నియోజకవర్గం టిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు హైదరాబాదులోని నంది నగర్ లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను సోమవారం నాడు ను కలిశారు. బాన్సువాడ బారాస నియోజకవర్గం ఇన్చార్జిని కేసీఆర్ నిర్ణయిస్తారని, రెండు రోజుల్లో ప్రకటిస్తా రని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు సాధించాలని కార్యకర్తలను కోరారు. హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్, తదితరులు పాల్గొని ఎన్నికల్లో విజయ బాధ్యత తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గం బారాస ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

## త్వరలో అక్రిడేషన్ కార్డుల జారీ: మంత్రి

టైమ్స్ ఆఫ్ వార్త - భద్రాద్రి కొత్తగూడెం



త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అక్రిడేషన్ కార్డులను జారీ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై సోమవారం మంత్రి పొంగులేటికి ఖమ్మంలో టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డుల అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి



టైమ్స్ ఆఫ్ వార్త - పాల్వంచ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)




చదువు ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని, ప్రతిభను వెలికితీసేందుకు తాము కట్టుబడిగా ఉన్నామని కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరి పేర్కొన్నారు. సోమ వారం మండలంలోని నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.50 వేల విలువైన నూతన వంటషెడ్ నిర్మాణానికి నిధులు, నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "అందరూ చదవాలి, అందరూ ఎదగాలి" అనే నినాదంతో విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలను ఫౌండేషన్ కొనసాగిస్తోందని వివరించారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అవలంబించి, సమాజంలో దారి చూపే వ్యక్తులుగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనంలో పాల్గొన్న ఆమె, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ రూప్లా నాయక్, సామాజిక సేవకులు ఉపేందర్ నాయక్, పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాసవి నగర్‌లో ఆధార్ కేంద్రం

టైమ్స్ ఆఫ్ వార్త - మణుగూరు



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మణుగూరులో ఆధార్ సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వాసవి నగర్ గిరిజన భవన్‌లో ఈ కేంద్రం జూలై 15, 16, 17 తేదీలలో పనిచేస్తుందని తహసీల్దార్ నరేష్ తెలిపారు. ఆధార్ కార్డు వివరాల సవరణ, నవీకరణ కోసం అశ్వాపురం, మణుగూరు, పిన పాక, కరకగూడెం మండలాల ప్రజలు ఈ అవకా శాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

**PRINTED, PUBLISHED & OWNED BY** MANKALA DASU, H.NO, 3-8-289, Road No. 2 SURYODAYA COLONY , LB NAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor MANKALA DASU, RNI NO. **APTEL/2007/22828** CELL: 9705506999